పంట నష్టం వివరాల సేకరణ



చొప్పరామన్నగూడెంలో రైతుల నుంచి వివరాలు సేకరిస్తున్న తహసీల్దార్, ఏవో



పోలవరంలో తడిసిన ధాన్యం పరిస్థితిపై రైతులతో మాట్లాడుతున్న అధికారులు

కొయ్యలగూడెం : గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు నష్టపోయిన రైతుల వివరాలను సేకరిస్తున్నట్లు తహసీల్దార్ పాసం నాగమణి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం మండల వ్యవసాయ శాఖ అధికారి చెన్నకేశవులుతో కలసి గవరవరం, చొప్ప రామన్నగూడెం గ్రామాలలో ఆమె పర్యటించారు. తడిసిన మొక్కజొన్న పొలాలను పరిశీలించారు. మొక్కజొన్న కండెలను కళ్ళాలలో ఆరబెట్టి ఉంచాలని, ఐదు శాతం ఉప్పు ద్రావణం స్ప్రే చేయాలని రైతులకు సూచించారు. మండలంలో 4,500 మొక్కజొన్న సాగు చేయగా ఇప్పటివరకు 2,300 ఎకరాల్లో కోతలు పూర్తి అయినట్టు తెలిపారు. రానున్న మూడు, నాలుగు రోజులు వర్షసూచన ఉన్నందున కోతలు నిలుపుదల చేయాలని రైతులకు సూచించారు. అత్యవసర సమయాలలో తమ సేవలను వినియోగించుకోవాలని అందుకు సంబంధించి సిబ్బంది ఫోన్ నెంబర్లను అందించారు. 60 ఎకరాలలో 180 కింటాళ్ల మొక్కజొన్న తడిసినట్లు ప్రభుత్వానికి నివేదిక పంపించినట్లు తెలియజేశారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

పోలవరం రూరల్ : అకాల వర్షాలతో తడిసిన మొక్కజొన్న పంటను కొనుగోలు చేసేందుకు రైతు భరోసా కేంద్రాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. పోలవరం మండలంలోని గూటాల, కొత్త పట్టిసీమ ప్రాంతాల్లో వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలను బుధవారం అధికారులు పరిశీలించారు. పొలాల్లో ఉన్న మొక్కజొన్న, ధాన్యం తడిసిపోయాయని, వాటిని ఒబ్బిడి చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని , ప్రభుత్వం వెంటనే వీటిని కొనుగోలు చేయాలని రైతులు ఈ సందర్భంగా కోరారు. రైతు భరోసా కేంద్రాల్లో గోనె సంచులు సిద్ధంగా ఉంచాలని కోరారు. రైతులకు నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోలవరం మండల ప్రత్యేకాధికారి ఎం.నాగేశ్వరరావు, తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు, మండల వ్యవసాయ శాఖ అధికారి కె.రాంబాబు, గూటాల సొసైటీ అధ్యక్షులు సుంకర అంజిబాబు, రైతులు పాల్గొన్నారు.

బాధితురాలికి సహాయం అందజేత

పోలవరం రూరల్ : గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో పోలవరం మండలం పట్టిసీమ గ్రామానికి చెందిన కోలా లక్ష్మీకాంతం బంగాళా పెంకుటిల్లు పై కప్పు కూలిపోయింది. ఆ ఇంటిని తహసీల్దార్ బి.సుమతి, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, సర్పంచ్ ఎస్.శ్రీరామచంద్రమూర్తి పరిశీలించి ఆమె పరిస్థితిని తెలుసుకున్నారు. తక్షణమే 25 కేజీల బియ్యం అందజేశారు. ఈమెకు పీఎంఏవై గృహం మంజూరు చేయిస్తామని తెలిపారు.

సమస్యలను పరిష్కరించాలని ఆదేశం



కేఆర్‌పురం ఐటీడీఏలో అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఇన్‌చార్జి పీఓ సత్యనారాయణ

బుట్టాయగూడెం : పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం నిర్మించిన పునరావాస కాలనీల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ జీవీవీ సత్యనారాయణ ఆదేశించారు. మండలంలోని కేఆర్‌పురం పీఓ ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో మంచినీటి సమస్య తీర్చే విధంగా చేతిపంపులు ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా తాడువాయి పునరావాస కాలనీల్లో సింగిల్ హౌస్‌గా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని డబుల్ హౌస్‌గా మార్చాలని గృహ నిర్మాణశాఖ అధికారులను ఆదేశించారు. అలాగే డ్రెయినేజీలు సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. అదేవిధంగా కాలనీలో వీధిలైట్లు అన్నీ వెలిగేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని కాలనీల్లో సోలార్ సిస్టమ్ లైట్లు ఉన్నాయని అవన్నీ కూడా సక్రమంగా పనిచేసేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ పీవీఎస్ నాయుడు, తాడువాయి గృహ నిర్మాణశాఖ డీఈ శ్రీనివాసరావు, ఎలక్ట్రికల్ డీఈ అంబేద్కర్, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ రాజీవ్, తహసీల్దార్లు కె. చల్లన్నదొర, ఎలీషా, జంగారెడ్డిగూడెం, వేలేరుపాడు, జీలుగుమిల్లి ఎంపీడీఓలు, బుట్టాయగూడెం, కుక్కునూరు సీడీపీఓలు, వెలుగు ఏపీడీ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పీఓ సత్యనారాయణ ముప్పినవారిగూడెం సమీపంలో నిర్మించిన చిగురుమామిడి పునరావాస కాలనీ, రౌతుగూడెం సమీపంలో నిర్మించిన కట్కూరు కాలనీని ఆయన సందర్శించారు. అలాగే నిర్వాసితులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఆదుకున్న ఆరోగ్యశ్రీ

ఎమ్మెల్యే బాలరాజు చొరవతో బాలుడికి సకాలంలో అందిన చికిత్స



గుండె చికిత్స అనంతరం కోలుకున్న హర్షవర్థన్

బుట్టాయగూడెం: ఆరోగ్య శ్రీ పథకం ఒక గిరిజన బాలుడిని ఆదుకుంది. బుట్టాయగూడెం మండలం బెడదనూరుకు చెందిన పాయం దుర్గారావు కుమారుడు హర్షవర్ధన్ అనే ఆరేళ్ల బాలుడు గుండెలో రంధ్రం ఏర్పడి వైద్యం చేయించుకోలేని స్థితిలో గత ఆరేళ్లుగా బాధపడుతున్నాడు. ఆ గిరిజన బాలుడికి ఇటీవల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆధ్వర్యంలో సాయి ఆస్పత్రి యాజమాన్యం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరంలో వైద్య పరీక్షలు చేశారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు చొరవతో వెంటనే ఆ బాలుడికి ఆరోగ్యశ్రీ ద్వారా రాజమండ్రిలో మంగళవారం గుండెకు సంబంధించిన చికిత్స అందించారు. ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం కొంత సొమ్ములను ఎమ్మెల్యే తెల్లం బాలరాజు చెల్లించారు. చికిత్సానంతరం ఆ బాలుడు కోలుకోవడంతో ఎమ్మెల్యే బాలరాజుతోపాటు సాయి ఆస్పత్రి ఎండీ డాక్టర్ విజయ్ కుమార్, గుండె వైద్య నిపుణులు డాక్టర్ శరత్ చంద్రకు ఆ బాలుడి తండ్రి దుర్గారావు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా కండిగలమ్మ ఆలయ శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల: మండలంలోని గుండుగొలను కుంటకు వెళ్లే మార్గంలోని చిలుకూరి ధర్మారావు తోటలో శ్రీ కండిగలమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు చేతుల మీదుగా ఈ వేడుక అట్టహాసంగా జరిగింది. ముందుగా ఆలయం వద్దకు విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు, పురోహితులు, వైఎస్సార్ సీపీ నాయకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి కలశంతో వెళ్లి అమ్మవారిని దర్శించి, పూజించారు. అనంతరం శాస్త్రోక్తంగా జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, వైఎస్ ఎంపీపీ యలమర్తి దుర్గాదేవి, ఎంపీటీసీ పెద్దిరెడ్డి రమ్యకుసుమ, ఉక్కుర్తి వెంకట్రావు, చిలుకూరి చంద్రం, తేలు వెంకటేశ్వరరావు, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, అచ్యుత ఏసుబాబు, బొండాడ సాత్యకిరావు, చిలుకూరి నాగ సుబ్రహ్మణ్యం, శ్రీవారి దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడు మానుకొండ సుబ్బారావు, స్థానిక సొసైటీ అధ్యక్షుడు గుర్రాల లక్ష్మణ్, బొండాడ వెంకన్నబాబు, జీవీకే రెడ్డి, బాలం వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

ఏరియా ఆస్పత్రిలో వైద్యసేవలపై ఆగ్రహం



వైద్యులతో మాట్లాడుతున్న పోల్నాటి బాబి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి వైద్యసేవలపై వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. జీలుగుమిల్లి మండలం పాలచర్ల నుంచి పాయిజన్ కేసు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి వచ్చింది. ఆసుపత్రి వైద్యులు కనీస వైద్యం చేయకుండా ఏలూరు రిఫర్ చేశారంటూ చికిత్స నిమిత్తం తీసుకువచ్చిన వ్యక్తి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితుడిని విజయవాడ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోల్నాటి బాబ్జి వెంటనే ఏరియా ఆసుపత్రికి వచ్చిన జరిగిన ఘటనపై ఆరా తీసి, వైద్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రికి వచ్చిన వారికి కనీస వైద్యం అందించలేరా అంటూ మండిపడ్డారు. ఈ ఘటనపై తాను డీసీహెచ్‌ఎస్‌వోకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తానని తెలిపారు. కాగా ఏరియా ఆసుపత్రిలో రిఫర్ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నట్లుగా పలువురు పేర్కొంటున్నారు. మూడు రోజుల క్రితం ఆసుపత్రికి వచ్చిన పాయిజన్ కేసును రిఫర్ చేశారని, మరలా ఇప్పుడు కూడా అదేవిధంగా వైద్యులు రిఫర్ చేశారని అంటున్నారు.

జగన్‌తోనే ప్రతి ఇంటికి సంక్షేమం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

కామవరపుకోట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో ప్రతి ఇంటికి సంక్షేమ లబ్ధి అందుతోందని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. ఆడమిల్లి గ్రామంలో బుధవారం 128 వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా గడపగడపకు వెళ్లి వృద్ధులను, మహిళలను, చిన్నారులను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ పేరుతో ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేశారన్నారు. కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేపట్టిన వెంటనే కుల, మత రాజకీయాలతీతంగా అర్హులైన వారందరికీ నవరత్నాలను ప్రవేశపెట్టి అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యా దీవెన , రైతు భరోసా, జగనన్న ఇంటి పథకం వంటి సంక్షేమ పథకాలు అమలుచేస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కూడా వైఎస్సార్ సీపీకి ఓటేసి వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడత రమేష్ బాబు, టౌన్ కన్వీనర్ నానాది సాగర్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పండు జగదీష్, పార్టీ నాయకులు రాయంకుల సత్యనారాయణ, గుర్రాల రవికుమార్, బొట్ల లక్ష్మణ్, గ్రామ పాల్గొన్నారు.

వైద్య సేవలపై అవగాహన కల్పించాలి



సీతంపేట సచివాలయం వద్ద హెల్త్ కేర్ సర్వీస్ నిర్వహణలో పాల్గొన్న బృందం సభ్యులు

కొయ్యలగూడెం : వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ద్వారా వృద్ధులకు ఇంటివద్దకే అందిస్తున్న వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సామాజిక పరివర్తన మార్పు విభాగం జిల్లా కోఆర్డినేటర్ టీఎస్ స్నేహన్ పేర్కొన్నారు. బుధవారం సీతంపేటలో సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రెండు అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన సందర్శించారు. అనంతరం ఆయా ప్రదేశాల్లో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి టాస్క్ ఫోర్సు కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ కమిటీకి లీడర్‌గా వ్యవహరించే గ్రామ సామాజిక ఆరోగ్య అధికారి ద్వారా వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం ద్వారా అందించే సేవలపై ప్రజలకు అవగాన పెంచాలన్నారు. ప్రతి నెలా గ్రామ స్థాయి టాస్క్ ఫోర్సు కమిటి సమావేశమై చర్చించుకోవాలన్నారు. ప్రతి సచివాలయంలో బాలల కోసం ప్రత్యేక రిజిస్టర్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ వారి కోరిక మేరకు ఏలూరు జిల్లాను రక్త హీన రహిత జిల్లాగా మార్చేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సచివాయల ఉద్యోగులు, వీఆర్‌ఓ ఎస్‌వీ సుబ్బారావు, గ్రామ సామాజిక ఆరోగ్య అధికారి చిన్నం చైతన్య, ఏఎన్ఎం ఎం.వెంకాయమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు ఈకేవైసీ

కొయ్యలగూడెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రిటైర్డ్ ఉద్యోగులకు ఈకేవైసీ ఆన్‌లైన్ ప్రక్రియ కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. జంగారెడ్డిగూడెం సబ్ ట్రెజరీ అధికారి కంచర్ల చంద్రయ్య ఆదేశాల మేరకు సీనియర్ అకౌంటెంట్ ఆరేటి హనుమంతరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. వివిధ అనారోగ్య కారణాలవల్ల లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకోకపోవడంతో గత నెలలకు సంబంధించిన పెన్షన్ నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో రిటైర్డ్ పెన్షనర్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి కె.నారాయణరావు సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆన్‌లైన్ ప్రక్రియను అమలు చేశారు. ఈనెల 10వ తేదీ లోపు సర్వీస్ పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు ఈకేవైసీ నిర్వహించుకోవాలన్నారు. కార్యాలయ సిబ్బంది నాగ లక్ష్మి, సింధు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలిపివేయాలి



జంగారెడ్డిగూడెం బైపాస్ రోడ్డులో రాస్తారోకో చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

జంగారెడ్డిగూడెం : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ బుధవారం సీఐటీయూ, ఏఐటీయూసీ, కార్మిక సంఘాలు, వామపక్షాల ఆధ్వర్యంలో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. స్థానిక బైపాస్ రోడ్డులో బ్యానర్లు, జెండాలను చేతబట్టి నినాదాలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సిగ్గు ఎగ్గు లేకుండా దేశానికే గుండెకాయ లాంటి విశాఖ ఉక్కును ప్రైవేటీకరణకు పూనుకోవడం దారుణమన్నారు. ఎన్నో పోరాటాలు, ఎంతో మంది ప్రాణత్యాగాల ఫలితంగా విశాఖ ఉక్కు ఏర్పడిందని, ఆంధ్ర ప్రజల హక్కు విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రైవేటీకరణ ఆపకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ షేక్ సుభాషిని, సీపీఐ జేవీ రమణరాజు, సీపీఎం మానుకొండ జీవరత్నం, చల్లారి మాణిక్యాలరావు, జి.సూర్యకిరణ్, వెంకటరాజు, బి.యశ్వంత్, రైతు సంఘం బి రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం అందుగుల ప్రభాకర్, సీహెచ్ శ్రీను, సుంకర రాధాకృష్ణ, కొత్తూరి నాగేశ్వరరావు, విమలేష్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : ఎంతోమంది బలిదానంతో ఏర్పడిన విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలిపివేయాలని వామపక్ష పార్టీల నాయకులు బుధవారం స్థానిక గణేష్ సెంటర్లో రాస్తారోకో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీపీఐ పార్టీ మండల కన్వీనర్ జమ్మి శ్రీనివాస్, సీపీఎం పార్టీ మండల కన్వీనర్, సీఐటీయూ నాయకులు శుక్లా బోయిన రాంబాబు, విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కొయ్యలగూడెం మండల కమిటీ సభ్యులు పాల్గొని జాతీయ ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు.

చింతలపూడి : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం పట్టణంలో సీపీఐ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో బోసుబొమ్మ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షుడు తొర్లపాటి బాబు, మండల సీపీఐ కార్యదర్శి కె గురవయ్య మాట్లాడుతూ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు కార్మికులు, కార్మిక సంఘాలు చేస్తున్న పోరాటం 800 రోజులు పూర్తి చేసుకున్నా కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరితో వ్యవహరిస్తోందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు కలిసి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దేవినేని రమేష్, నాగు, నక్కా తిరుపతిరావు, రాజుబోయిన వెంకటేశ్వరరావు, శ్రీను పాల్గొన్నారు.

కుక్కునూరు: కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మేందుకు చేస్తున్న యత్నాలను నిలిపివేసేంత వరకు పోరాటాలను కొనసాగిస్తామని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్, సీపీఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి స్పష్టంచేశారు. విశాఖ ఉక్కుపరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో చిరవెల్లిలో, సీపీఐ ఆధ్వర్యంలో పెద్దరావిగూడెం గ్రామాలలో ఆర్‌అండ్‌బీ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.

క్లుప్తంగా

జంగారెడ్డిగూడెం జూనియర్ సివిల్ జడ్జిగా కిషోర్‌కుమార్



కిషోర్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న బార్ అసోసియేషన్ నాయకులు

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం నూతన సివిల్ జడ్జిగా సీహెచ్ కిషోర్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు జడ్జిగా ఉన్న ఆర్.వరలక్ష్మి పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలికి బదిలీపై వెళ్లగా, గుడివాడ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేసిన సీహెచ్ కిషోర్‌కుమార్ బదిలీపై వచ్చి జంగారెడ్డిగూడెం సివిల్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు తల్లాడి అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఏవీవీ భువనేశ్వరి, లైబ్రరీ కార్యదర్శి విత్తనాల రత్నరాజు, న్యాయవాదులు పాల్గొన్నారు.

లోక్‌అదాలతో పెండింగ్ కేసుల పరిష్కారం



బాధ్యతలు స్వీకరిస్తున్న సి మధుబాబు

చింతలపూడి : పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్‌అదాలత్‌లు చక్కటి మార్గమని జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు సూచించారు. స్థానిక కోర్టు ఆవరణలో బుధవారం ఆయన జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మే 13న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో క్రిమినల్, సివిల్ కేసులు, బ్యాంక్ రికవరీ, చెక్ బౌన్స్, బీఎస్ఎన్ఎల్ రికవరీ కేసులు, కుటుంబ తగాదా కేసులు పరిష్కారం చేసుకోవచ్చునని తెలిపారు. ప్రతి రోజూ కోర్టులో ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహించి కేసులు రాజీ చేస్తున్నట్లు తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వివరాలకు దగ్గరలోఉన్న పోలీస్ స్టేషన్‌లను, కోర్టు సిబ్బందిని సంప్రదించాలన్నారు.

విజయదుర్గమ్మ ఆలయానికి విరాళం



దాత చిన్ని రామ సత్యనారాయణ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని విజయదుర్గమ్మ ఆలయ అభివృద్ధికి ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ దంపతులు రూ.25,116 విరాళం అందజేశారు. తొలుత అమ్మవారికి పూజలు నిర్వహించి అనంతరం ఆలయ కమిటీకి విరాళాన్ని అందించారు. దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ తెలిపారు. ఆలయ కమిటీ కార్యదర్శి మాడా రామ్మోహనరావు, సభ్యులు గుడిమెట్ల యుగంధర్, యర్రం ఉదయ్‌కుమార్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌టీఆర్ భూములకు పట్టాలివ్వాలని వినతి

బుట్టాయగూడెం : మర్రిగూడెం సమీపంలో ఉన్న ఎల్‌టీఆర్ భూములను గిరిజనులకు దక్కేలా చూడాలని కోరుతూ సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నాయకులు ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ జీవీవీ సత్యనారాయణకు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గిరిజనులు పూనెం పార్వతి, పి.కమల మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా సుమారు 25 కుటుంబాలకు చెందిన గిరిజనులు ఎల్‌టీఆర్ భూముల్లో సాగు చేసుకుంటున్నామని చెప్పారు. ఆ భూములకు పట్టాలిచ్చి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ చంద్రన్నవర్గం నాయకులు సాలి రాజశేఖర్, సముద్రాల పూర్ణచంద్రరావు, కాలిబాబు, కమలా గంగ, ఆనందరావు, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

వసుధా ఫౌండేషన్ దాతృత్వం

జంగారెడ్డిగూడెం : వీల్‌చైర్‌కే పరిమితమైన వ్యక్తికి జీవితకాలం పింఛన్ రూపంలో అందించేందుకు వసుధ ఫౌండేషన్ ముందుకు వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. వేలేరుపాడు మండలం భూదేవిపేటకు చెందిన పి.కమలాకర్‌కు ప్రమాదంలో పొట్ట భాగం నుంచి కాళ్ల వరకు చచ్చుబడిపోయింది. అతను నడవలేని పరిస్థితిలో వీల్‌చైర్‌కు పరిమితమై జీవనాన్ని ఇబ్బందిగా సాగిస్తున్నాడు. అతని పరిస్థితిని తెలుసుకున్న వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు ప్రతి నెలా రూ. 2వేల చొప్పున జీవితకాలం పింఛన్ రూపంలో అందించేందుకు ముందుకు వచ్చారు. బుధవారం వసుధ ఫౌండేషన సభ్యులు కొండపల్లి పండు, సీహెచ్ చంద్రశేఖర్, కె.రామకృష్ణ బాధితుడి గ్రామానికి వెళ్లి రూ. 2వేలు నగదును అందజేశారు. బాధితుడు వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజుకు, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

జంగారెడ్డిగూడెం రూరల్ : అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని సర్పంచ్ గురజాల ధర్మవతి అన్నారు. మండలంలోని టెక్కినవారిగూడెంలో బుధవారం జగనన్న లేఔట్‌లో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి, మద్ది దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు మట్నేడి బాబి మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పరిపాలన చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గాదె రామానుజులు, వార్డు సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి

జంగారెడ్డిగూడెం రూరల్ : సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి అన్నారు. మండలంలోని శ్రీనివాసపురం సచివాలయంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.సచివాలయ కార్యాలయాలకు వచ్చే ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు సక్రమంగా అందించాలని అన్నారు. సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ జుజ్జవరపు తాతారావు, వీఆర్‌వో దత్తు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ

లింగపాలెం : ధర్మాజీగూడెం గ్రామ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేకల రాజు, ఎంపీటీసీ మేకల రాజ్యలక్ష్మిను బుధవారం పార్టీ నేతలు పరామర్శించారు. మేకల రాజు మాతృమూర్తి మేకల నాగేశ్వరమ్మ మూడురోజుల క్రితం మృతి చెందారు. ఈమేరకు జెడ్పీటీసీ వడ్లాని హరినాథ్‌రాజు, పార్టీ మండల అధ్యక్షుడు కొఠారి మోహనరావు, ములగలంపాడు సర్పంచ్ ఇనుగంటి రాజేష్‌బాబు, నాయకులు సొంగా సందీప్, భూపతి పుల్లయ్య, పి బాబురావు తదితరులు రాజు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఆపదమిత్రలకు కిట్ల అందజేత

పోలవరం రూరల్ : వరదలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో రెస్క్యూ టీమ్‌గా ప్రజలకు సహకారం అందించేందుకు వలంటీర్లు, ఆశ కార్యకర్తలకు ఇటీవల శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు తెలిపారు. వీరికి ఆపద మిత్ర పథకం ద్వారా మండలానికి 20 కిట్లు మంజూరయ్యాయన్నారు. ఈ కిట్‌లను శిక్షణ పొందిన వారికి బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద అందజేశారు. ఈ కిట్‌ల ద్వారా వరదల సమయంలో అవసరమైన పరికరాలను అందజేయడం జరిగిందన్నారు. అధికారుల సూచనలు మేరకు వీరు ప్రజలకు ఆపద సమయంలో సహాయ సహకారాలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ నిఖిల్ మధు, సిబ్బంది పాల్గొన్నారు.

చీటింగ్ కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ యు.ఉమామహేశ్వరరావు తెలిపారు. వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెంకు చెందిన మైగాపుల విజయ్‌కుమార్‌కు ఏపీ 05 ఓఏ 3345 నెంబరు గల కారు ఉంది. పట్టణానికే చెందిన గడిమి సురేంద్ర కారును ఒకసారి తనకు ఇవ్వమని అడగటంతో విజయ్‌కుమార్ ఇచ్చాడు. అయితే కారును ఇవ్వకుండా సురేంద్ర హైదరాబాద్ వెళ్లిపోయాడని, ఇప్పటికి ఏడాది గడుస్తున్నా స్పందించకపోడంతో విజయ్‌కుమార్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. ఆమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

నేడు వాహనాల వేలం

టి.నరసాపురం : ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 17 మోటార్‌సైకిళ్లు, ఒక కారును గురువారం ఉదయం 9 గంటలకు టి.నరసాపురం పోలీస్‌స్టేషన్ వద్ద వేలం నిర్వహించనున్నట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. జీలుగుమిల్లి సర్కిల్ ఇనెస్పెక్టర్ బి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ వేలం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆసక్తిగలవారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలని, ఆధార్, పాన్ కార్డులను తప్పనిసరిగా సమర్పించాలన్నారు.

జూన్ 3 వరకు శిక్షణ

కొయ్యలగూడెం : ఉచిత ధ్యాన, యోగా శిక్షణ తీసుకోవడం ద్వారా విద్యార్థులు చదువులో ఏకాగ్రత సాధించి ప్రజ్ఞావంతులు కాబడతారని బుద్ధ హెల్త్ ఫౌండేషన్ డైరెక్టర్, టీచర్ జె.జ్యోతి పేర్కొన్నారు. వేసవి సెలవులను పురస్కరించుకొని పరింపూడి బాలికల హైస్కూల్లో ఉచిత ధ్యాన యోగా శిక్షణ తరగతులను జూన్ 3వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం ఆరు నుంచి ఏడు గంటల వరకు సాయంత్రం ఐదు నుంచి 6 గంటల వరకు బాలికల విభాగంలో క్లాసులు నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతాలకు చెందిన హైస్కూల్ విద్యార్థులతో పాటు కళాశాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.